
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 29 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 శుక్రవారం
సహర్ 4:43 శనివారం

తెగిన ఆ'ధా'రం'



- రోడ్డునపడిన నేతన్నలు
- మూతబడిన మరమగ్గాలు.. పస్తులతో కార్మికులు
- సిరిసిల్లలో 20 వేల మరమగ్గాలపై వస్త్రోత్పత్తి బంద్
- భిక్షాటన, వంటావార్పు, ధర్నాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో మునుపటి పరిస్థితులు ఆవిష్కృతమవుతాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నేతన్నలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉపాధి కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. పోగుపోగు అతుకుతూ చిక్కు పడిన ఎదురుపోగులను వేరు చేస్తూ మరమగ్గాల చప్పుళ్ల మధ్య నేతన్నలు జీవనం సాగించారు. గత ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి పొందారు. కొత్త ప్రభుత్వంలో ప్రభుత్వ ఆర్డర్లు దూరమవడం, ప్రైవేటు మార్కెట్ కోల్పోయి ఆర్డర్లు లేకపోవడంతో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మళ్లీ సిరిసిల్ల నేతన్నల బతుకు చిత్రం తిరగబడినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే పవర్‌లూం నేత కార్మికుడు శ్రీనివాస్ బలవన్మరణం చెందడంతో మళ్లీ చితికిపోయే పాత పరిస్థితులు ముందుకొచ్చాయా? అనే ఆందోళనలో కార్మికులు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ మళ్లీ సిరిసిల్ల మరమగ్గాల కార్మికులు రోడ్డునెక్కి ఆందోళనలు చేస్తున్నారు. రాస్తారోకోలు, నిరాహార దీక్షలు, భిక్షాటనలు చేసిన కార్మికులు గురువారం చేనే త జౌళి శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వంటావార్పుతో నిరసన తెలిపారు.

నేతన్న చుట్టూ రాజకీయాలు

సిరిసిల్ల వస్త్ర సంక్షోభంతో కార్మికులు ఆగిన మరమగ్గాల మధ్య పస్తులతో విలవిల్లాడుతుంటే పార్టీలు మాత్రం నేతన్న చుట్టూ రాజకీయాలు వొలకబోస్తున్నాయి. నేత కార్మికులకు కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆర్డర్లను పూర్తిస్థాయిలో ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. టెక్స్‌టైల్ పార్కుకు సమగ్ర శిక్ష డిపార్ట్‌మెంట్ నుంచి స్కూల్ యూనిఫాం కోసం షర్టింగ్ క్లాత్ ఆర్డర్లు ఇచ్చినా సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులను ఆదుకునే పరిస్థితుల్లో లేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఒకరికి ఒకరు విమర్శలకే పరిమితం అవుతున్నా సంక్షోభం వైపు దృష్టి పెట్టడం లేదు. మళ్లీ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు ఎర్రజెండాలు చేతబూని కార్మికులపక్షాన నిలుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆర్డర్లపై స్పష్టత మాత్రం రావడం లేదు. ఎన్నికల కోడ్ కూడా రావడంతో అధికారికంగా మాట్లాడని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మెరుగైన ఆర్డర్లు వస్తాయని భావించినా బతుకమ్మ చీరలు ఇతర ఆర్డర్లు వచ్చే పరిస్థితులు లేవని తేలిపోయింది. సిరిసిల్లలో నేత కార్మికులు ఆసాములు, ప్రైవేటు వస్త్రోత్పత్తి ఆర్డర్లపై దృష్టి పెట్టాలని చేనేత జౌళి శాఖ రాష్ట్ర డైరెక్టర్ అలుగు వర్షిణి స్పష్టం చేశారు. చివరకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన ప్రభుత్వ బకాయిలు రూ .270 కోట్లు కూడా సెప్టెంబరు వరకు చెల్లిస్తామని ప్రకటించడంతో వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనపించడం లేదు. ఇక ప్రభుత్వ ఆర్డర్లు కూడా రావడం కష్టమని భావిస్తున్నారు.

గతంలో సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలపై ప్రభుత్వ ఆర్డర్లు, ఇతర కాటన్ ఉత్పత్తులు జరిగేవి. 2017 నుంచి సిరిసిల్ల పరిశ్రమను సంక్షోభం నుంచి ఆత్మహత్యలు ఆకలి చావుల నివారణ దిశగా ప్రభుత్వ ఆర్డర్లను ఇస్తూ ప్రభుత్వం ఉపాధి కల్పనకు దోహదపడింది. దాదాపు ప్రతీ సంవత్సరం రూ.400 కోట్లకు పైగా ఆర్డర్లు వచ్చేవి. ప్రభుత్వం నుంచి చెల్లింపులు కొంత ఆలస్యమైనా కార్మికులకు ఉపాధి దొరకుతూ ముందుకు సాగేది. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఆర్డర్లలో ప్రధానంగా ఉండే బతుకమ్మ చీరలను నిలిపివేసింది. దీంతోపాటు బహిరంగ మార్కెట్‌లో ఆర్డర్లు లభించని పరిస్థితుల్లో సిరిసిల్లలో 20 వేల మరమగ్గాలు మూతపడ్డాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందే 15 వేల మందికార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ చీరల ఉత్పత్తికి ప్రభుత్వం 2017 నుంచి విభిన్న రంగులు, డిజైన్లలో ఆర్డర్లు ఇస్తూ వచ్చింది. రూ.225 కోట్లతో మొదలైన ఆర్డర్లు 2023లో రూ.350 కోట్ల వరకు పెరిగింది. ప్రతీ సంవత్సరం కోటి చీరలు, 6.30 కోట్ల మీటర్ల బతుకమ్మ బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందిస్తూ వచ్చింది.

గత సంవత్సరం ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలతో పాటు సర్వశిక్ష అభియాన్, సంక్షేమ శాఖలకు సంబంధించిన బట్ట ఉత్పత్తి బకాయిలు రూ.270 కోట్లకు పైగా రావాల్సి ఉంది. దీంతోపాటు బతుకమ్మ చీరలపైనా కార్మికులకు యారన్ సబ్సిడీ రూపంలో ఒక మీటరుకు రూ .1.25 చొప్పున వారికి అందజేస్తున్నారు. యారన్ సబ్సిడీ 5128 మంది కార్మికులకు ఇప్పటి వరకు రూ.8.77 కోట్లు అందించారు. 2022, 2023కు సంబంధించిన కార్మికులకు యారన్ సబ్సిడీ రావాల్సి ఉంది. వస్త్రోత్పత్తి దారులు, కార్మికులు, బకాయిలు ఇవ్వమని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న సెప్టెంబరు వరకు అందే పరిస్థితులు లేవు. మరోవైపు ఎన్నికల కోడ్ కూడా రావడంతో బకాయిల విడుదల లేనట్టేనని భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఆర్డర్లు ఇవ్వాలంటూ మంత్రుల చుట్టూ తిరుగుతూనే ధర్నా, ఆందోళనలుచేస్తున్నా ప్రభుత్వాన్ని మాత్రం కదిలించడం లేదు.



కార్మికుల ఆందోళనలో అరెస్టులు (ఫైల్)



సిరిసిల్లలో కార్మికుల వంటావార్పు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం శివపార్వతుల కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



ఆలయం వెలుపల నుంచి అక్షింతలు చల్లుతున్న భక్తులు

7

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మార్చి 28 : రైతులకు అండగా ఉండడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ రూరల్ మండలంలోని నమలిగుండుపల్లిలో మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఎల్లంపల్లి నీరు నమిలిగుండుపల్లి చేరిన సందర్భంగా జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడేలేశ్వరస్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఎల్లంపల్లి నీరు నమలిగుండుపల్లి నీరు విడుదల సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు మారోజు రవి మారోజు తిరుపతి శంకరయ్య అజయ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శరీరంపై మచ్చలు ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 28 : శరీరంపై ఎలాంటి మచ్చలు ఉన్నా వైద్యాధికారులను సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి రజిత అన్నారు. గురువారం జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా ఎల్‌సీడీసీలో జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ఇంటింటిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ జిల్లాలో 2119 మందిని కుష్టు అనుమానితులుగా గుర్తించామన్నారు. ప్రారంభంలోనే చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యధికారిని సంప్రదిస్తే ఉచితంగా మందులను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు చేపూరి శ్రీనివాస్, రేపూరి కాశీనాథం, కూన సురేష్, రెబెల్లి శ్రీనివాస్, హెచ్‌ఈ బాలయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 28 : సిరిసిల్ల వరకు ఉన్న నేత కార్మికుల ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించకుండా వారి సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ పంపినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించక పోవడంతో పరిశ్రమ నేడు కుదేలైందని తెలిపారు. బకాయిలను చెల్లించాలని 45 రోజులుగా ఆసాములు, కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సిరిసిల్లలో కార్మికుల పరిస్థితులు దయనీయంగా మారాయని, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బతుకమ్మ చీరల బకాయిలు రూ. 270 కోట్లు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

సిరిసిల్ల క్రైం, మార్చి 28: కేసుల్లో శిక్షల శాతం పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల రేణుక ఎల్లమ్మ కల్యాణమండపంలో ఫిర్యాదుల స్వీకరణ, కేసు నమోదు, చార్జిషీట్‌లపై డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసు నమోదు, చార్జిషీట్‌వరకు ప్రతీ విషయాన్ని కూలంకషంగా నమోదు చేయాలన్నారు. కోర్టులలో నేరస్థులకు శిక్షలు పడే విధంగా ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచి సీఐ అనిల్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

కోనరావుపేట, మార్చి 28 : మహిళల రక్షణ షీ టీం లక్ష్యమని షీ టీమ్ మెంబర్ ఏఎస్‌ఐ ప్రమీల అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలు, ఆకతాయిలతో ఇబ్బందులు పడితే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. షీ టీ మెంబర్లు ప్రియాంక, రమాదేవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఏఎస్సై

బార్ అసోసియేషన్ల కార్యవర్గాల ఎన్నిక



డి. సంజీవరెడ్డి



సదానందం, రజనీకాంత్

సిరిసిల్ల క్రైం, మార్చి 28: జిల్లాలోని సిరిసిల్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దోర్నాల సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ హాలులో గురువారం పోలింగ్ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా టి. వెంకటి, సంయుక్త కార్యదర్శిగా బి. నాగరాజు గౌడ్, కోశాధికారిగా బిట్ల విష్ణు, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శిగా గుడ్ల కిషన్, గ్రంథాలయ కార్యదర్శిగా జి.శశాంకం గెలుపొందారని ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు తెలిపారు.

వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సదానందం

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుడిసె సదానందం ఎన్నికయ్యారు. గురువారం వేములవాడలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, ప్రధాన కార్యదర్శిగా అవదూత రజినీకాంత్, సంయుక్త కార్యదర్శిగా శంకర్, లైబ్రేరియన్ కార్యదర్శిగా మనోహర్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా సంపత్ కుమార్, మహిళా ప్రతినిధిగా అన్నపూర్ణ, కోశాధికారిగా బొడ్డు ప్రశాంత్ కుమార్, సీనియర్ కౌన్సిల్ సభ్యులుగా పంపరి శంకరయ్య, జె. శంకర్, సుజాత, జూనియర్ కౌన్సిల్ సభ్యులుగా నవీన్, రాకేష్, వంశీకృష్ణ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కే విద్యాసాగర్ రావు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వీర్నపల్లి, మార్చి 28: వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండాలో జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను గిరిజనులు గురువారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల మత గురువు బాబు సింగ్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వహించారు. బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలి చెల్లించాలి

వీర్నపల్లి, మార్చి 28 : ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేస్తున్న కొంతమంది కూలీలకు డబ్బులు రాలేదని విన్నవించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పని స్థలాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు.

మతం పేరిట రాజకీయాలు చేయలేదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఎన్నడూ మతం పేరిట రాజకీయం చేయలేదని, మనిషిని మనిషిలా చూశామని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల షాదీఖానాలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లిం, సిక్కు ఎవరైనా పేదల కోసం పని చేశామన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌లు అందించామన్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురవాలని ప్రార్థనలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దీవెనలు అందించాలని కోరారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్, మసీద్ కమిటీ అధ్యక్షుడు సలీం, సత్తార్, యూసుఫ్, చాంద్‌పాషా, మునీర్, అఫ్రోజ్, ఉస్మాన్, అక్రమ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు కార్యాచరణ : కలెక్టర్



సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో సమృద్ధిగా తాగునీరు అందించే విధంగా పటిష్ఠ కార్యాచరణ రూపొందించి అమలుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరెట్‌లోని సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి సరఫరా, స్థితిగతులపై మండల, మున్సిపల్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల వారీగా తాగునీటి సరఫరా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న ఇబ్బంది ఎదురైనా సమస్య తీవ్రత ఎక్కువ చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటే ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేయవచ్చని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, స్థానికంగా ఉన్న నీటి వనరులు, బోరు బావులను గుర్తించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తాగు నీటి పంపులు, బోరు బావుల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద తాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా కోసం అవసరమైన అత్యవసర పనులను వెంటనే నామినేషన్ పద్ధతిలో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ఇంట్రా పెండింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలన్నారు.

గ్రామాల్లో ఉన్న ప్రతీ వార్డు, మున్సిపల్ వార్డులు, చివరి హ్యాబిటేషన్‌వరకు తాగునీటి పరిస్థితిపై మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతీ గ్రామం, బస్తీ, మున్సిపల్ వార్డులో తాగునీటి సరఫరా ప్రణాళికలు రూపొందించుకోవాలని, నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు నియంత్రించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరా హెడ్ డిస్ట్రిబ్యూటర్ ఇంట్రా స్థాయిలో నీటి స్థాయి ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఏదైనా సమస్య అయితే సకాలంలో స్పందించి వాటిని త్వరగా పరిష్కరించేలా చూడాలని అన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం స్థానిక సంస్థలు గ్రామ పంచాయతీల వద్ద అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల పరిధిలో పనుల కోసం ఎన్నికల ప్రవర్తన నియమావళి అడ్డు రాదని తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టే పనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా చూడాలన్నారు. వేసవిలో ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా చేపట్టాలని, నీటి వృథాను అరికట్టాలని, నీటి లీకేజీలను సత్వరమే పరిష్కరిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. అవకాశం ఉన్నచోట హ్యాండ్ పంపులు, నీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈలు జానకి, విజయ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఈఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఈఈలు, డివిజనల్ పంచాయత్ అధికారులు, ఎంపీవోలు, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

మేకలకు మేతగా వరి పంట



ఎండిన వరి చేను మేస్తున్న మేకలు

గంభీరావుపేట, మార్చి 28 : నిండు వేసవి రాక ముందే ఎండలు మండుతున్నాయి. ఫలితంగా బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సాగు నీరందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు ఎండిన వరిని మేకలకు మేతగా వదిలేస్తున్నారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామ పరిధిలో వ్యవసాయానికి బోరు బావులే ప్రధాన ఆధారం. గ్రామానికి చెందిన కాపరవేని మహేష్ అనే యువ రైతు తనకున్న 2 ఎకరాల్లో బోరు, బావిపై ఆధారపడి ఎకరం పొలంలో వరి సాగు చేశాడు. నాట్ల సమయంలో నీటితో ఉన్న బావి నెల కిందటే చుక్క నీరు లేకుండా ఎండి పోయింది. మిగిలిన బోరు కూడా వట్టి పోవడంతో వేసిన వరి పంటను కాపాడేందుకు అనేక ప్రయత్నాలు చేశాడు. ఫలించక పోవడంతో వరి పంటను మేకలకు మేతగా వదిలేశాడు.

కాపాడే మార్గం లేకనే..

- మహేష్, యువరైతు, గజసింగవరం

వరి పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశాను. ఉన్న బావి ఎండిపోయింది. బోరులో చుక్క నీరు రాని పరిస్థితి. ఎకరం వరి పంట కళ్లేదుటే ఎండిపోతుంటే కంట నీరు వస్తోంది. ఆరుగాలం శ్రమించిన ఫలితం లేకుండా పోయింది. సాగు నీటి ప్రయత్నాలు ఫలించలేదు. చేసేది ఏమిలేక పంటను మేకలకు మేతగా పెట్టాను.



పచ్చునూర్‌లో కేంద్ర బలగాల కవాతు

మానకొండూర్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో పులి పద్మ అనే మహిళను హత్య చేసిన కేసులో నిందితుడు పులి గంగయ్య గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన నిందితుడి అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. పులి పద్మకు ఆమె ఇంటి పక్కనే ఉన్న పులి గంగయ్యకు కొంత కాలం నుంచి భూమి సరిహద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కాటమయ్య పండుగ జరుగగా నిందితుడు గంగయ్య హాజరయ్యాడని ఆయన తెలిపారు. ఆ సమయంలో గంగయ్య భార్య పులి రేణుక ఇంటిలో ఎవరు లేని సమయంలో వంట గదిలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితుడు గంగయ్య ఇంటికి వచ్చి చూసే సరికి భార్య చనిపోయి ఉండటం వల్ల పులి పద్మనే కారణమని భావించి ఉలి తీసుకుని ఆమెను ఇంట్లో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసినట్లు ఆయన అన్నారు. పద్మ భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు గంగయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,500 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 46మంది రైతులు 609క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,500, కనిష్ఠ ధర 4వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాల్లో కొనుగోళ్లు ఉండవని, తిరిగి సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

పీఆర్ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ

ఇల్లందకుంట, మార్చి 28: ఇల్లందకుంట మండల పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేశారు. ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బోగంపాడు, ఇల్లందకుంట, వంతడుపుల గ్రామాలకు రూ. 30లక్షలు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. కాగా పనులు చేపట్టడంలో ఏఈ రాంబాబుకు నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఈజీఎస్ పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 28: మానకొండూర్‌లో గురువారం విద్యుత్ స్తంభం పై నుంచి పడి జూనియర్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ బాలక్రిష్ణ 33కేవి లైన్ బ్రేక్‌డౌన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్‌లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నప్పటికీ జూనియర్ లైన్‌మన్‌తో పనులు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నలువల స్వామి డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 28: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వినియోగం లోకి ఓ పెట్రోల్ బంక్ ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాళీ స్థలములో కొబ్బరి చెట్ల కింద గుర్తు తెలియని మగ వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతడు 15 రోజులుగా గ్రామంలో మానసిక స్థితి బాగాలేక రోడ్డు వెంబడి తిరిగినట్లు స్థానికులు తెలిపారు. ఎండ వేడిమికి వడదెబ్బ కారణంగానే అతడు మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(51) ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకొని ఇంటికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు పుల్లూరి గట్టయ్య ఢీకొట్టాడు. దీంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు పుట్ట సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో అస్వస్థతకు గురై ప్రయాణికుడి మృతి

మెట్‌పల్లి, మార్చి, 28 : మెట్‌పల్లి పట్టణ శివారులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న భోగం సామయ్య(70) అనే వృద్ధుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన భోగం సామయ్య కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. పనుల నిమిత్తం తన సొంత గ్రామానికి వెళ్లి తిరిగి గురువారం తన చెల్లెలితో కలిసి హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సులో నిజామాబాద్‌కు బయలు దేరారు. మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట చేరుకోగానే సామయ్య ఊపిరాడక పడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో సామయ్యను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో ఊపిరాడక గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం


రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, మార్చి 28: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గురువారం విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భీమరాజ్‌ను ఉత్తమ రైతుగా ఘనంగా సన్మానం చేశారు. రైతులు వారు పండించిన పంటలపై వారికి ఉన్న సమస్యల పరిష్కారం, పెట్టుబడి తగ్గించి ఎక్కువ లాభాలను ఏ విధంగా సమకూర్చుకోవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, అల్లీపూర్ దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ డీఏ రజనీ దేవి, ఆర్థిక శాస్త్రవేత్త, పొలాస శాస్త్రవేత్తల బృందం, అల్లీపూర్ ఎఫ్‌ఈవో అధ్యక్షుడు అత్తినేని శంకర్, రైతులు ఓరుగంటి రాజలింగం, ఓరుగంటి రాజు, ఎల్లేశ్వరం శేఖర్, గొల్లపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన


హుజూరాబాద్‌రూరల్, మార్చి 28: మండలంలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ సిబ్బంది ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సిద్దాంత్ లోహియా రైతులు వేసవి కాలంలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ భారత్, రైతు గూడూరు స్వామిరెడ్డి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, కాటిపల్లి సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రామచంద్రం, పల్లె వీరయ్య, మల్లు, గాజా తిరుపతి, సామల కోటిరెడ్డి, గూడూరి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మల్లాపూర్, మార్చి, 28: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లోనే ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అను ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసు స్టేషన్‌లో చేసుకున్న మందు పార్టీ వెలుగులోకి వచ్చింది. ప్రజలకు బాధ్యతగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి విందు చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేయగా హెడ్ కానిస్టేబుల్ అశోక్‌పై శాఖా పరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదిక పంపించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

టేకు దుంగల పట్టివేత

మల్లాపూర్, మార్చి, 28 : మండలంలోని గొర్రెపల్లి గ్రామ శివారులోని అక్రమంగా నిలువ చేసిన టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు డీఫైఆర్‌వో చంద్రమౌళి, ఎఫ్‌బీవో సత్తార్‌లు పట్టుకున్నట్లు గురువారం తెలిపారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామ శివారులోని రూంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా టేకు దుంగలను నిలవ చేసిన పక్క సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను స్వాధీనం చేసుకొని దొంగల కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకొన్న టేకు దుంగల విలువ సుమారు రూ. 1,50 వేలే ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న దుంగలను రేంజ్ టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


నిండుగా ప్రవహిస్తున్న కెనాలు

నిండుగా కాకతీయ కాలువ

- నీళ్లు లేక వరదకాలువ వెలవెల

మల్యాల, మార్చి 28: ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు లేక బోసిపోతుంటే.. నిండుగా ప్రవాహంతో ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ జలకళ సంతరించుకుంది. చివరి దశలో ఉన్న వరి పంటలకు చివరి తడి అందించేందుకు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కెనాల్‌కు అధికారులు నీళ్లు వదలగా వరదకాలువలో నీరు లేక కాలువ కింద సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మల్యాల మండలంలో ఎస్సారెస్పీ వరదకాలువ, కాకతీయ కెనాల్ ఉన్నాయి. ఒక్క దానిలో నీరు, మరొక దానిలో నీరు లేకపోవడంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీరు లేక బోసిపోతున్న వరదకాలువ

కమనీయం శివపార్వతుల కల్యాణం

- జనసంద్రమైన వేములవాడ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు


స్వామివారల ఉత్సవమూర్తులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేములవాడ, మార్చి 28: ఆది దంపతులు పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కల్యాణం వేములవాడ పుణ్యక్షేత్రంలో గురువారం కన్నుల పండువగా సాగింది. దక్షిణ కాశీగా, భూలోక కైలాసంగా హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ముందుగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ క్రతువును ప్రారంభించారు. తొలుత ధ్వజారోహణం అనంతరం వరుడు రాజరాజేశ్వరస్వామివారు, వధువు పార్వతీదేవి అమ్మవార్లను వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాలతో ఎదుర్కొన్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆలయం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, మున్సిపాలిటీ తరుపున కమిషనర్ అన్వేష్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారల ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 10-50 గంటలకు వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య మాంగళ్యధారణ గావించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్-ఇందిర దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆలయ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● కల్యాణం వీక్షించేందుకు..

పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, శివపార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని తన్మయత్వం చెందారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది శివపార్వతులు, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి మురిసిపోయారు. కల్యాణం జరుగుతున్నంత సేపు చేతిలో త్రిశూలాలను కదిలిస్తూ శివనామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, మేన్‌రోడ్డు ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్లపై భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక డీఎస్పీ కే.నాగేంద్రచారి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు శివపురాణం, ప్రధాన హోమం, సప్తపది, లాజాహోమము, ఔపాసనము, బలిహరణము నిర్వహించారు. అనంతరం పెద్దసేవపై స్వామివారలను ఊరేగించారు.


స్వామివారి ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న భక్తులు


మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు


పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ ఈవో, మున్సిపల్ కమిషనర్

రాయికల్‌లో గంజాయి పట్టివేత

● మైనర్‌తో పాటు ముగ్గురు నిందితుల అరెస్టు ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్, మార్చి 28: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ అడ్డాల వద్ద విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మైనర్‌తో సహా మరో ఇరువురు వ్యక్తులను గురువారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన పాత నేరస్థులైన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్, ఓ బాలుడు జగిత్యాల నుంచి రాయికల్‌కు గంజాయిని సరఫరా చేస్తూ రాయికల్ మండలం కుమ్మరిపెల్లి స్టేజీ వద్ద పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇటీవల గంజాయి కేసులో రిమాండ్ అయిన పెనుగొండ గణేష్, మాలావత్ సతీష్‌తో జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్‌తో పాటు మరో బాలుడు ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరు సీసీఎల్ దగ్గరికి వెళ్లి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు అక్రమంగా తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ గ్రూప్ సభ్యుల్లో కొందరు మైనర్లకు గంజాయిని అలవాటు చేశారని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 25న గంజాయి తక్కువ ధరకు విక్రయించి గురువారం రాయికల్‌కు అక్రమంగా తీసుకువస్తుండగా తమ వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించామన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. పట్టుబడిన ఇరువురు నిందితులపై జగిత్యాల, వరంగల్ జిల్లాల్లోని మూడు స్టేషన్‌ల పరిధిలో పాత కేసులు ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదు..

నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని ఆరుముల్ల సాయి కుమార్ తల్లిదండ్రులు గంగాధర్, రజిత అన్నారు. గతంలో సాయి కుమార్ తప్పు చేసినప్పుడు పలు కేసులు నమోదయ్యాయని, ఆరు మాసాలుగా ఇంటి వద్దే ఉండి పని చేసుకుంటున్నాడని అన్నారు. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీ మాట్లాడుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అందుకే అరెస్టు చేశామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పెగడపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పెగడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ , మరో బాలుడు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా స్థానిక నంది చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకుని వస్తుండగా నంది చౌరస్తా వద్ద పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో 900 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి, ద్వాచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ రఘుచందర్ వివరించారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ, ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్ రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

కారు, బైకు ఢీ.. వృద్ధురాలు మృతి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28: కారు, బైకు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని మిర్జంపేటలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) తన మనవడు విగ్నేష్‌తో కలిసి మండలంలోని మిర్జంపేటలో దశదిన కార్యక్రమానికి వచ్చి గురువారం ద్విచక్ర వాహనంపై తిరిగి గుంపులకు వెళుతుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఓదెమ్మ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. తిప్పారపు మహేష్ తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న విగ్నేష్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి

తిమ్మాపూర్, మార్చి28: అర్హులైనా అభ్యర్థులు సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ టెస్టింగ్ ద్వారా నిర్వహించే కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ(యూజీ)- 2024)ను కేంద్ర విద్యా శాఖ, యూజీసీ తప్పనిసరి చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ టి లలితకుమారి తెలిపారు. ఈ పరీక్ష కేంద్ర విద్యా శాఖ పరిధిలో ఉండే కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర విశ్వ విద్యాలయాలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలో, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష అని తెలిపారు. ఈసీయూఈటీ పరీక్ష దేశంలోని అన్ని కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రైవేటు విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొందడానికి అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 200 విశ్వవిద్యలయాలు, 46 కేంద్ర విశ్వ విద్యాలయాలు, 30 రాష్ట్ర విశ్వ విద్యాలయాలు, 9 డీమ్డ్(స్వయం ప్రతి పత్తి), 113 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 6 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఈసీయూఈటీ(యూజీ)-2004 వెబ్ సైట్‌లో ఫిబ్రవరి-2024న ప్రారంభించినట్లు చెప్పారు. మార్చి 31లో గడువు ముగియనుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https//exams.nta.ac.in/CUET-UGలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హత్యకేసులో నిందితుడికి జైలు

మంథని, మార్చి 28: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి గురువారం తీర్పునిచ్చారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన దూపం శ్రీనివాస్ ఇంట్లోకి 11మే 2023న అక్రమంగా చొరబడి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితుడు శ్రీనివాస్ భార్య దూపం స్వప్న మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు సదయ్యను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తి అనంతరం మంథని కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి భారతి నిందితుడు గుండ్ల సదయ్య దాడి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానాను విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 28: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష మరొకరికి ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 15 మందిని గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఐదుగురికి జైలు శిక్ష, మొత్తం 9,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 10 మందికి 19,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సంవత్సరములో 102 మందికి జైలు శిక్ష పడిందని సీఐ పేర్కొన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామన్నారు.

నర్సింగాపూర్‌లో చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి, మార్చి 28: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఒకరి ఇంట్లో గుర్తులేని వ్యక్తులు చొరబడి వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బైరగోని మల్లేశం అనే వ్యక్తి వేములవాడలోని ఉంటాడు. నర్సింగాపూర్ గ్రామంలో ఉండే ఇంట్లో భద్రపరిచిన 10 తులాల వెండి పట్టగొలుసులను తీసుకెళ్లేందుకు గ్రామానికి గురువారం రాగ ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగ 10 తులాల పట్టా గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ధర్మపురిలో ఘనంగా వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తిని సేవపై ఆశీనులు చేశారు. అనంతరం సేవను దక్షిణ దిశలో గల పోలీస్‌స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామి వారల కళ్యాణం, తెప్పె, డోలోత్సవం అనంతరం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కోసం బయలు దేరడం ఏటా జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల వద్ద సనాతన సాంప్రదాయ రీతిలో వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య, యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, తదితరులు రాత్రి వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ కుటుంబ సభ్యులు వేదికల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు రాపర్తి సాయి కిరణ్, మాదాసు మల్లేష్, స్తంభంకాడి గణేష్, కొమురెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

రాష్ట్రాన్ని రాబందుల్లా దోచుకున్నారు



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 28 : రాష్ట్రాన్ని రాబందుల్లా దోచుకుతిన్నారని, గత ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బాధలో బావబామ్మర్దులు కేటీఆర్, హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కాంగ్రెస్ వచ్చింది.. కరువు వచ్చింది అని తంగళ్లపల్లిలో మాట్లాడడం గమనిస్తే అసలు బుద్ధుండే మాట్లాడుతున్నారా? అనే అనుమానం వస్తోందని, మతి భ్రమించి, అధికారం కోల్పోయిన బాధలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. సోదరి కవిత లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైలో ఉన్నారని, ఫోర్జరీ, చీటింగ్ కేసులో సంతోష్‌రావు, హరీష్‌రావు, కేటీఆర్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో పాత్ర ఉందంటూ రోజుకు ఒక కథనం వినిపిస్తున్న వేళ మతి కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శీతాకాలం సమయంలో ఏర్పడిందని, వేసవికాలం అయిపోయి వర్షాకాలంలో వర్షాలు పడకుంటే కరువు వచ్చిందంటే ఒక అర్థం ఉంటుందని, ఇప్పుడు వర్షాలు పడడం లేదని వాళ్లు చేస్తున్న వాదన అసంబద్ధమని అన్నారు. బావా బామ్మర్దులు కలిసి రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని కంకణం కట్టుకున్నట్లు అనిపిస్తోందన్నారు. తొమ్మిదిన్నరేళ్ళలో కేవలం వారి కుటుంబ సభ్యులు బాగుపడ్డారు తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వారి కుటుంబ సభ్యులు అవినీతి అక్రమాలు కేసుల్లో పీకల్లోతు మునిగిపోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కల్వకుంట్ల కుటుంబం బందీ అయ్యిందన్నారు. ఆ కేసులో ఎక్కడ అరెస్ట్ అవుతామోననే భయంతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. లక్షల కోట్ల ప్రజాధనంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి అది కుంగిపోగానే పది టీఎంసీల నీటిని సముద్రంలోకి విడిచి పెట్టింది మీరు కాదా? అని ప్రశ్నించారు. రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తే ప్రతిపక్ష నాయకుడి హోదాలో కేసీఆర్ ఎందుకు రాలేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మే రోజులు పోయాయని, రాష్ట్రంలో కరువు రావాలని బీఆర్ఎస్ వారు కోరుకుంటున్నారని అన్నారు. గత పాలకులకు ముందు చూపు లేకపోవడంతో కృష్ణ జలాలను పక్క రాష్ట్రం వారికి అప్పజెప్పారని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజలపై 6 లక్షల 67 వేల కోట్ల భారం మోపారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను నమ్మొద్దని, ఇంత కష్టకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆరు గ్యారంటీలపై వారు చేస్తున్న ఆరోపణలు చూస్తే నవ్వొస్తోందని, రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల పెంచామన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నామని, 500కే సిలిండర్‌తోపాటు ప్రతీ నియోజకవర్గానికి 3600 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. తంగళ్లపల్లిలో కేటీఆర్ మాట్లాడిన మాటలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, సంగ స్వామి, కూరగాయల కొమురయ్య, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల/ తంగళ్లపల్లి)

రైతులను చూస్తే గోస అనిపిస్తోందని, కౌలు రైతులు ముందే డబ్బులు చెల్లించి పండించిన పంటలు పశువుల మేతగా మారిన పరిస్థితులు వచ్చాయని, ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే సమయంలో కాళేశ్వరం నీళ్ల మేడిగడ్డ నుంచి ఎత్తిపోసి మిడ్ మానేరు నింపి అన్నపూర్ణ నుంచి రంగనాయకసాగర్, జిల్లెల్ల చెరువులను కేసీఆర్ నింపారన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చిన తరువాత మేడిగడ్డ వద్ద మూడు పిల్లర్లు కుంగిపోతే మూడు, నాలుగు నెలలు అవుతున్నా రిపేరు చేయడానికి టైం సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. మూడు పిల్లర్ల వద్ద ఒక కాపర్ డ్యాం కట్టి, వృథాగా సముద్రంలోకి వెళ్తున్న నీళ్లను ఒడిసిపట్టి పంపింగ్ చేసి ఉంటే రైతుల పంటలు ఎండిపోయేవి కావన్నారు. కాళేశ్వరం మీద, కేసీఆర్ మీద కడుపు మంటతో మేడిగడ్డ రిపేరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు పట్టింపు లేకపోవడంతోనే వ్యవసాయ దారులు, కౌలు రైతులు, రైతులు, ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ నాయకులు అన్ని నియోజకవర్గాల్లో రైతుల వద్దకు వెళ్తున్నారన్నారు. డిసెంబరు 9న అధికారంలోకి వస్తున్నామని, రుణాలు తీసుకోని వారు కూడా తీసుకోవాలని, వెంటనే రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. రుణమాఫీ చేయకపోగా బ్యాంకుల ద్వారా రైతులకు లీగల్ నోటీసులు పంపుతున్నారని, రుణాలు కడతారా? చస్తారా? అని మెడమీద కత్తి పెట్టినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ యాసంగి పంటకు సంబంధించి రూ.7 వేల కోట్లు రైతు బంధు కోసం పెట్టిన సొమ్మును వారికి ఇవ్వకుండా కాంట్రాక్టర్ల ఖజానాలు నింపడానికి, బిల్లులు చెల్లించడానికి, చిల్లర వ్యవహారానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. రైతులకు రుణమాఫీ లేదని, కౌలు రైతులకు పైసలు ఇవ్వడం లేదని, అఖరికి ముఖ్యమంత్రికి పంటల వదకు వచ్చి రైతులను పరామర్శించే తీరికలేదన్నారు. నాలుగు నెలలుగా 15సార్లు ఎక్కిన విమానం, దిగే విమానం అన్నట్లు జాతరలు, యాత్రలు, చేసుడే తప్ప రైతుల పొలాల దిక్కు చూసిన పాపాన ముఖ్యమంత్రి, మంత్రులు పోలేదన్నారు. డిసెంబరు 9న రూ.2లక్షల రుణామాఫీ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ కోడూ అడ్డం రాదని, అవసరమైతే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని అన్నారు. ఎన్నికల హామీని నిలుపుకుంటామని, రైతులకు భరోసా ఇస్తామని కోరాలని అన్నారు. ఇప్పటికే దాదాపు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. కౌలు రైతులు, రైతు కూలీలకు పైసలు ఇవ్వాలన్నారు. చెరవులు, వాగుల్లోకి నీళ్ల పంపింగ్ చేయకపోవడంతోనే నష్టం జరిగిందన్నారు. కేసీఆర్ గతంలో ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని ఆర్డర్ ఇచ్చారని, ఆ ఆర్డర్‌నైనా నిలబెట్టుకోవాలని అన్నారు. లేదా రైతులపై ప్రేమ ఉంటే ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నష్టపోయిన పంట ఎలాగూ పోయిందని, మిగిలిన పంటకైనా హామీ ఇచ్చినట్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ దగ్గరకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలన్నారు. మంచి జరుగుతుందని ఆశించి రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించుకొని మోసపోయారన్నారు. వారిని పట్టించుకోకపోయినా ముఖ్యమంత్రి, మంత్రులకు తీరికలేకపోయినా మీ తరఫున మేముంటామని ప్రతీ గ్రామానికి వస్తామని కేసీఆర్ కూడా స్వయంగా బయల్దేరి రాబోతున్నారని అన్నారు. ధైర్యంగా ఉండండి, ఆత్మహత్యలతో కుటుంబాలను ఇబ్బందుల పాలు చేయవద్దని అన్నారు. ధైర్యంగా ముందుకెళ్దామని, ప్రభుత్వంతో కొట్లాడుదామని అన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా బోనస్ తెచ్చుకుందామన్నారు. మేడిగడ్డ రిపేరు చేసుకొని కాళేశ్వరం నీళ్లు వచ్చేటట్లు చేసుకుందామన్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, బండి దేవదాస్, కోయ్యడ రమేష్, సిరిసిల్ల పర్శరాం, మాజీ సర్పంచ్ మధు ఉన్నారు.



తంగళ్లపల్లిలో పంటను పరిశీలిస్తున్న కేటీఆర్

ఎండిన వరిని పరిశీలించిన కేటీఆర్

తంగళ్లపల్లి, మార్చి 28: తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఎండిన వరిపంటను బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ గురువారం పరిశీలించారు. రూ.60 వేలు వెచ్చించి కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తే నీళ్లులేక పంట ఎండిపోతోందని రైతు పర్శరాములు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం ఇచ్చే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని రైతుకు ధైర్యం చెప్పారు. గతంలో తమకు పట్టాలు ఇచ్చారని ఇప్పటి వరకు సర్వే చేసి స్థలం హద్దులు ఏర్పాటు చేయలేదని జిల్లెల్ల గ్రామానికి చెందిన సుమారు 15 మంది దళిత లబ్ధిదారులు కేటీఆర్‌కు విన్నవించుకున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫోన్ చేసి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎంపీపీ పడిగెల మానస రాజు, నాయకులు గుడూరి ప్రవీణ్, తోట ఆగయ్య తుల ఉమ, గజభీంకర్ రాజన్న, పుసపెల్లి సరస్వతి, బండి దేవదాస్, మాట్ల మధు, కొయ్యడ రమేశ్, సిరిసిల్ల పర్శరాములు, గుగ్గిళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై స్వామివారల విహారం



స్వామివార్లను నెమలి వాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 28: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శివకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీఅనంతపద్మనాభస్వామి, పార్వతీరాజరాజేశ్వర స్వామివార్లను నెమలి వాహనంపై ఊరేగించారు. రాత్రివేళలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారల పెద్దసేవ ఊరేగింపు చేపట్టారు. డీఎస్పీ నాగేంద్రచారి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు హాజరైన కేటీఆర్

సిరిసిల్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేతారకరామారావు గురువారం సిరిసిల్లలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, రేణుక దంపతుల తనయుడు మంచె నిఖిల్, అనూష వివాహ వేడుకకు హాజరై ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకుడు అక్కనపల్లి రాజయ్య, లక్ష్మీ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్త నరేష్, బీఆర్ఎస్ నాయకుడు బల్యాల శ్రీకాంత్, హారిక, గర్దాస్ మహేష్, మోక్షశ్రీ వివాహ వేడుకల్లో దంతులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకుడు కొండ శంకర్ పద్మ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. సిరిసిల్ల బల్యాలనగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు సాయికుమార్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూప మహేష్ నూతన గృహప్రవేశ వేడుకలో సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వేములవాడ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు లోక బాపురెడ్డి, గూడూరి ప్రవీణ్, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సీనియర్ నాయకులు చీటీ నర్సింగరావు, ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో కాంగ్రెస్‌లో చేరికలు

కోనరావుపేట, మార్చి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూసి పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కొలనూరు సింగిల్ విండో డైరెక్టర్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ దేవయ్యతోపాటు పలువురు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య బాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

వీర్నపల్లి, మార్చి 28 : వేసవిలో మారుమూల గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, వన్‌పల్లిలో తాగునీటి సమస్యపై ఇంటింటా తిరిగి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వన్‌పల్లిలో పోలింగ్ కేంద్రం, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీపీవో వీర బుచ్చయ్య, గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, డీఈఈ రామ్ కుమార్, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నరేష్, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

అందరి సహకారంతోనే సంఘాల అభివృద్ధి



సభలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, మార్చి 28 : అందరి సహకారంతో సహకార సంఘాలు అభివృద్ధి బాటల పయనిస్తున్నాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం సింగిల్ విండో ద్వారా రూ. 2 కోట్ల 33 లక్షల 10 వేల పై చిలుక లావాదేవీలు జరిగాయన్నారు. గోరంటాలలో గోదాం నిర్మాణం పూర్తవుతోందన్నారు. వైస్ చైర్మన్ రామాంజనేయులు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ సర్పంచ్ శ్రీధర్‌పంతులు, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, మేనేజర్ సత్యంరావు, డైరెక్టర్లు బార ఎల్లవ్వ, మల్యాల రాజవీర్, మురళి, అంజిరెడ్డి, కిష్టారెడ్డి రైతులు ఉన్నారు.

రూ.50 వేలకు మించి తరలిస్తే సీజ్

- కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట, మార్చి 28: గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ చెక్ పోస్టును గురువారం రాత్రి కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తరలిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సరైన పత్రాలు, ఆధారాలు లేకండా నగదు తరలిస్తే సీజ్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పి.గౌతమి, స్థానిక తహసీల్దార్ భూపతి, ఎంపీవో రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



చెక్ పోస్ట్ తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

బ్రాహ్మణ సమాజాన్ని దూరం పెడుతున్న రాజకీయ పార్టీలు



మాట్లాడుతున్న సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 28: బ్రాహ్మణ సమాజాన్ని రాజకీయ పార్టీలు దూరం పెడుతున్నాయని బ్రాహ్మణ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి రాచర్ల పార్థసారథి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో బ్రాహ్మణులకు టికెట్‌లు ఇవ్వలేదన్నారు. బీజేపీ మాత్రం హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బ్రాహ్మణులకు ఇచ్చిందన్నారు. కరీంనగర్ లోక్ సభ అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికి ప్రకటించలేదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుపరిచితుడైన కటుకం మృత్యుంజయంకు కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలన్నారు. పీవీ నర్సింహరావు, శ్రీపాదరావుతో కలసి నాడు కాంగ్రెస్ పార్టీకి మృత్యుంజయం సేవలు అందించారన్నారు. నాయకులు పంచరత్నాలు, యాదగిరిశర్మ, శివకుమార్‌శర్మ పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు అన్నదాతల పాట్లు

- చీరలు పరిచి స్థలాన్ని ఆపుకున్న రైతులు



రైతులు వేసిన చీరలు, టార్పలిన్‌లు

రుద్రంగి, మార్చి 28: వరి ధాన్యం ఆరబేట్టేందుకు సరైన స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలో వరి కోతలు ప్రారంభం కాకముందే ధాన్యం ఆరబేట్టేందుకు రైతుల పాట్లు అన్నీఇన్నీకావు. చీరలు, టార్పలిన్‌లను పరిచి ముందస్తుగా స్థలాన్ని ఆపుకుంటున్నారు. మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏటా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం ఆరబోతకు సరైన స్థలం లేకపోవడంతో బతుకమ్మ చెరువు, ఓడ్డెర కాలనీ ప్రభుత్వ పాఠశాల, సబ్‌స్టేషన్ వద్ద చీరలు, టార్పలిన్‌లు పరిచారు. ఇది ఇలా ఉంటే 20 ఎకరాలు స్థలాన్ని కేటాయించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చందుర్తి, మార్చి 28 : చందుర్తి మండలం మల్యాలలో హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చింతపంటి రామస్వామి, మ్యాకల గణేష్, లక్ష్మీనారాయణ, అబ్రహం, రాజయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



పూజలు నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

వైభవంగా శివ కల్యాణం

చందుర్తి ,మార్చి 28:చందుర్తి మండలం మూడపల్లిలో శివాలయంలో గురువారం శివ కల్యాణం వైభవంగా నిర్వహించారు. చందుర్తి సింగిల్ విండో వైస్ చైర్మన్ పుల్కం మోహన్-లత దంపతులు పుస్తె మట్టెలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో బహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వర స్వామివారల కల్యాణం, తెప్పె, డోలోత్సవాలు తిలకించి ప్రత్యేక దర్శనం చేసుకుని తిరుగు ముఖం పట్టారు. శుక్రవారం రథోత్సవం తిలకించేందుకు ఒకరోజు ముందు నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయాల్లో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిత్యపూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్య వేక్షణలో రినోవేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- లక్ష్మీనృసింహ స్వామి, వేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి రథోత్సవాల కోసం ఆలయం తరఫున ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారలను దర్శించుకునేందుకు వీలుగా ఇసుక స్తంభం వరకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 28 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని, ఏప్రిల్ 1వ తేదీన ప్రతీ మండలంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యాసంగి సీజన్ 2023-24 సంవత్సర ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు, అయా శాఖల భాధ్యులు మాత్రమే కేంద్రాలను ప్రారంభించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వంటి వసతులను కల్పించాలని, టార్పలిన్‌కవర్లు, ప్యాడీ క్లీనర్‌లు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని కోరారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ కోరారు. తాలు, తప్ప లేకుండా తేమ శాతం 17 ఉండేలా చూసుకోని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2203, గ్రేడ్-బీ రకానికి క్వింటాల్‌కు రూ.2183 ధర నిర్ణయించిదని వెల్లడించారు. నిబంధల మేరకు రైతులు ధాన్యాన్ని శుభ్రంగా తీసుకురావాలని, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు.

ఏప్రిల్ 1న ప్రారంభం

జిల్లాలో వరి కోతలు ప్రారంభమైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 13 మండల్లాలో ఏప్రిల్ 1న ఒక కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రకటించారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం జిల్లాలో ఈ సీజన్‌లో దాదాపు 3లక్షల నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావాల్సి ఉందన్నారు. ధాన్యాన్ని సేకరించేందుకు సింగిల్ విండోల ఆధ్వర్యంలో 201, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 10, మెప్మా ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అవసరమైతే ఇంకా ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు టోకెన్‌లను ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సారి ఐరీస్ యంత్రాలను పంపిస్తామని, ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతులకు ఐరీస్ కూడా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్‌మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు కొనుగోళ్లను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అందుబాటులో పరికరాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరిపడా పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతుల వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేందర్ ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీవో శేషాద్రి, డీటీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి



వంటావార్పులో పాల్గొన్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 28: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని, దానిపై అధారపడిన కార్మికులు, అసాములందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధి కల్పించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలంటూ వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో మూడు నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక నేతన్నలు వారి కుటుంబాలను పోషించుకునేందుకు అప్పుల పాలై ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం నేతన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు దఫాలుగా ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించ కుండా నేతన్నల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నివారణ, నేతన్నల ఉపాధి కోసం సీఐటీయూ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఐక్య పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. భవిష్యత్‌లో ఐక్య పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలకు చెందిన నాయకులు భాగస్వాములు కావాలని, నేతన్నలకు ఉపాధి కల్పించే పోరాటంలో కలిసి రావాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, ఒగ్గు గణేష్, కుమ్మరికుంట కిషన్, సబ్బని చంద్రకాంత్, సదానందం, సురేష్ రవీందర్, వేణు, రాజు,రవీందర్, సంపత్ సతీష్ పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.